

బీఎస్ఎన్ఎల్ జోష్



ప్రైవేటు ఆపరేటర్లు టారిఫ్‌లు పెంచడంతో ప్రభుత్వ రంగ సంస్థ వైపు వినియోగదారుల చూపు

- ఉమ్మడి జిల్లాలో గత నెల కొత్తగా 18,800 మంది కస్టమర్లు చేరిక
- అందులో 12,000 మంది ప్రైవేటు కంపెనీల వినియోగదారులే...
- ప్రస్తుతం ప్రీ, పోస్ట్‌పెయిడ్ వినియోగదారులు 4.3 లక్షల మంది
- మరిన్ని 4జి టవర్లు ఏర్పాటు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

బీఎస్ఎన్ఎల్...ఒకప్పుడు ఒక వెలుగువెలిగి, గత కొన్నాళ్లుగా ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ. ఇప్పుడు కాస్త నిలదొక్కుకునేందుకు యత్నిస్తోంది. ఇటీవల ప్రైవేటు టెలికాం కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు ఇష్టానుసారంగా టారిఫ్‌లు పెంచేశాయి. దీంతో గత నెల రోజులుగా ఆయా సంస్థల వినియోగదారులు లక్షలాది మంది బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లోకి మారిపోతున్నారు. ఒక్క జూలై నెలలోనే రాష్ట్రవ్యాప్తంగా 2.2 లక్షల మంది బీఎస్ఎన్ఎల్ కనెక్షన్ తీసుకోగా, వీరిలో 1.4 లక్షల మంది జియో, ఎయిర్‌టెల్, వీఐ నుంచి మొబైల్ నంబర్ పోర్టబులిటీ (ఎంఎన్‌పీ) పొందిన వారు ఉన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ ఈ సంఖ్య భారీగా ఉందని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ ఎన్ఎల్) అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో జూలై నెలలో 18,800 వేల మంది కొత్తగా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లో చేరగా, వీరిలో ఎంఎన్‌పీ ద్వారా ఇతర టెలికాం సంస్థల నుంచి వచ్చినవారు 12 వేల మంది వరకూ ఉన్నారు. ఈ నెలలో మొదటి పది రోజుల్లోనే సుమారు నాలుగు వేల మందికిపైగా కొత్తగా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లోకి వచ్చారు. వీరిలో మూడు వేల మంది ఇతర టెలికాం సంస్థల నుంచి మారినవాళ్లే.

భారీగా పెరిగిన ధరలు

గతంలో జియో రోజుకు 1 జీబీ సామర్థ్యం, 28 రోజుల వ్యాలిడిటీ ప్యాకేజీ రూ.199 ఉండగా, ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.250కి పెంచింది. 1.5 జీబీ సామర్థ్యం, 28 రోజులు వ్యాలిడిటీ ప్లాన్‌ను రూ.239 నుంచి రూ.299కు, 2 జీబీ సామర్థ్యం, 28 రోజులు వ్యాలిడిటీ కలిగిన ప్లాన్‌ను రూ.299 నుంచి రూ.349కు పెంచింది. జియోతోపాటు ఇతర టెలికాం సంస్థలు భారీగా టారిఫ్‌లు పెంచాయి.

కొత్తగా 800 4జి టవర్లు

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌కు 420 టవర్లు ఉన్నాయి. వీటిని 4జి టవర్లుగా అప్‌గ్రేడ్ చేయిస్తున్నారు. ఇప్పటివరకూ 28 టవర్లను అప్‌గ్రేడ్ చేశారు. అలాగే ప్రాజెక్టు 4జి శాచ్యురేషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 800 వరకూ 4జి టవర్లు ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటికే 50 టవర్లు ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. డిసెంబరు నాటికి మొత్తం టవర్లు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులు సాగుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ప్రతి గ్రామానికి హైస్పీడ్ ఇంటర్‌నెట్ సదుపాయాన్ని కల్పించడమే లక్ష్యంగా బీఎస్ఎన్ఎల్ 4జి ... మిగతా 6వ పేజీలో


సిటీలో రజనీకాంత్



విమానాశ్రయంలో రజనీకాంత్ -వార్త చిత్రజ్యోతిలో

సందడిగా కృష్ణాష్టమి

శ్రీకృష్ణ జన్మాష్టమిని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. సాగర్ నగర్ ఇస్కాన్ మందిరంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు వెల్లువలా తరలి వచ్చారు.





ప్రత్యేక అలంకరణలో ఇస్కాన్‌లో రాధాకృష్ణులు

పాత వారికే పట్టం!

- ఏయూలో మాజీ వీసీ ప్రసాదరెడ్డి వర్గానికే కీలక పదవులు
- తెలిసి చేస్తున్నారా?, తెలియక చేస్తున్నారా??
- కూటమి మద్దతుదారుల్లో ఆందోళన
- ఇలాగైతే మాజీ వీసీపై విచారణ చేపట్టినా ఫలితం ఉండదనే అభిప్రాయాలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కీలక పోస్టుల విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆ పార్టీ సానుభూతి పరులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వైసీపీ పాలనలో వీసీగా వ్యవహరించిన ప్రొఫెసర్ ప్రసాదరెడ్డి యూనివర్సిటీని పార్టీ కార్యాలయంగా మార్చేసిన సంగతి తెలిసిందే. పార్టీకి ఉపయోగపడే వారికే కీలక పదవులు ఇచ్చుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. ప్రసాదరెడ్డి చేసిన అడ్డగోలు వ్యవహారాలపై కమిటీ వేసి విచారణ చేయాలనే డిమాండ్ ఉంది. దీనిని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈలోగా కీలక పదవులను భర్తీచేస్తోంది. అయితే ప్రసాదరెడ్డి ద్వారా గతంలో ప్రయోజనం పొంది...కీలక స్థానాల్లో ఉన్నవారికే ఈ ప్రభుత్వం కూడా పెద్దపీట వేస్తోంది. దీనిని కూటమి మద్దతుదారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రసాదరెడ్డి వెళ్లిపోతూ అకడమిక్స్ అఫైర్స్ డీన్‌గా ఉన్న కిశోర్‌బాబును ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఇప్పుడు ఆయనకు కూటమి ప్రభుత్వం రెక్టార్ పదవి కట్టబెట్టింది. ఇది వర్సిటీలో చాలా కీలకమైన పదవి. అకడమిక్ వ్యవహారాలన్నీ రెక్టారే చూస్తారు. అలాగే ఇంటర్నేషనల్ అఫైర్స్ డీన్‌గా ధనుంజయ్‌రావును ప్రసాదరెడ్డి నియమించుకున్నారు. తాజాగా వైస్ ఛాన్సలర్ పోస్టు ఖాళీ అయినప్పుడు దాని కోసం ధనుంజయ్‌రావు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు అయన్ను కూటమి పెద్దలు రిజిస్ట్రార్‌గా నియమించారు. రెక్టార్, రిజిస్ట్రార్ రెండూ కీలక పదవులు. ఇవి ప్రసాదరెడ్డి బృందానికే దక్కడంతో యూనివర్సిటీలో ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. రేపు ఆయనపై విచారణ చేస్తే కీలక పదవుల్లో ఉన్న వీరు దానిని ప్రభావితం చేయకుండా ఉంటారని ఎలా నమ్ముతారని ప్రశ్నిస్తున్నారు. ఏయూకు సంబంధించిన నియామకాల్లో ... మిగతా 6వ పేజీలో



కిశోర్‌బాబు



ధనుంజయరావు

ఏయూ రెక్టార్‌గా ప్రొఫెసర్ కిశోర్‌బాబు

- రిజిస్ట్రార్‌గా ధనుంజయరావు
- డీన్లుగా మరికొందరు ఆచార్యులు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆచార్య ఎన్.కిశోర్‌బాబు రెక్టార్‌గా నియమితులయ్యారు. రిజిస్ట్రార్‌గా జియాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్, గత పాలకుల హయాంలో ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డీన్‌గా పనిచేసిన ఇఎస్.ధనుంజయరావును నియమించారు. ఈ మేరకు ఉపకులపతి ఆచార్య జి.శశిభూషణరావు సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అకడమిక్ అఫైర్స్ డీన్‌గా ఆచార్య కె.ఈశ్వరకుమార్‌ను, ఇంటర్నేషనల్ అఫైర్స్ డీన్‌గా ఆచార్య చల్లా రామకృష్ణను, సీడీసీ డీన్‌గా ఆచార్య టీవీ కృష్ణను, స్టూడెంట్ అఫైర్స్ ఇన్‌చార్జి డీన్‌గా డాక్టర్ జి. రాంబాబును, అసోసియేట్ డీన్లుగా ఎన్.ఎం.యుగంధర్, ఎస్.హరనాథ్, ఏఈఆర్‌సీ గౌరవ డైరెక్టర్‌గా ఆచార్య లిల్లీ గ్రేస్‌ను, కంప్యూటర్ సెంటర్ అసోసియేట్ డీన్‌గా డాక్టర్ కె. వెంకటరమణను, గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా డి.రామారావును, ఐఎఎస్ఈ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డి.నాగరాజకుమారిని నియమించారు. ఇదిలావుండగా రిజిస్ట్రార్‌గా ఆచార్య ధనుంజయరావు సోమవారం బాధ్యతలుస్వీకరించారు.ఈసందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

అవినీతి ఖాకీలపై నిఘా

- సమాచారం సేకరిస్తున్న పోలీస్ కమిషనర్
- ఒకరిద్దరు అధికారులకు బాధ్యతలు
- ఆధారాలు లభిస్తే శాఖాపరమైన చర్యలు
- నగరంలోని నాలుగు స్టేషన్‌లలో సీఐలపై ఆరోపణలు



సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ శాఖలో అవినీతిపరులపై సీపీ శంఖబ్రతబాగ్చి దృష్టిసారించారు. మల్కాపురం ఎస్ఐ దేముడమ్మ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో అక్రమార్కులను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన భావిస్తున్నట్టు సమాచారం.

సీపీ శంఖబ్రత బాగ్చికి ముక్కుసూటి అధికారిగా పేరుంది. పని విషయంలో రాజీపడరని, అవినీతి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలకు ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వెనుకాడరని అంటారు. ఇక్కడ బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన రాష్ట్ర శాంతిభద్రతల విభాగం అదనపు డీజీగా, అంతకుముందు సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల్లో పనిచేశారు. ఆయన సీపీగా రావడంతో విశాఖ రేంజ్‌లో పనిచేస్తూ నగరానికి రావాలని ఉవ్విళ్లూరిన పలువురు తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు. నగరంలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది, అధికారులు కూడా జాగ్రత్తగా ఉంటారని అంతా భావించారు. కానీ కొంత మంది ఏసీపీ, సీఐ స్థాయి అధికారులతోపాటు ఎస్ఐలు, కిందిస్థాయి సిబ్బంది ఎప్పటిలాగే తమ దందా కొనసాగిస్తున్నారు. బయటకు నిజాయితీపరులుగా, లంచాలు తీసుకోవడం ఆపేసినట్టు చెప్పుకుంటున్నప్పటికీ ఏమాత్రం అవకాశం దొరికినా అందినకాడికి పిండేస్తున్నారు. ఇటీవల బదిలీ అయిన ఇద్దరు అధికారులు తమ పరిధిలో సీఐల ద్వారా నెలవారీమామూళ్లు వసూలు చేయడంతోపాటు స్టేషన్‌కు వచ్చే ముఖ్యమైన కేసులను కానిస్టేబుళ్ల ద్వారా తమ వద్దకు తెప్పించుకుని సెటిల్‌మెంట్ చేసేవారని పేర్కొంటున్నారు. అలాగే ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని ఒక స్టేషన్‌తోపాటు ద్వారకా సబ్ డివిజన్, వెస్ట్ సబ్‌డివిజన్, హార్బర్ సబ్‌డివిజన్‌పరిధిల్లో ఒక్కొక్క స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐలు ఇప్పటికీ భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. వారిపై పత్రికల్లో కథనాలు రావడంతో సీపీ విచారణ జరిపించారు. అయితే విచారణ జరిపిన అధికారులు రెండు వేర్వేరు నివేదికలను ఇచ్చి ఆయన అయోమయంలో పడేలా ... మిగతా 6వ పేజీలో

కంచరపాలెం ఏఎస్ఐ సస్పెన్షన్

- ఫిర్యాదుదారుడి పట్ల దురుసుగా ప్రవర్తించారని అభియోగం

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

కంచరపాలెం స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న సతీష్‌ను సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కంచరపాలేనికి చెందిన ఒకరు తమ స్థలంలో పరాయి వ్యక్తులు భవనం నిర్మించారంటూ కొద్దిరోజులుకిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిని పరిశీలించిన ఏఎస్ఐ సతీష్ సివిల్ మేటర్ కాబట్టి తాము ఏమీ చేయలేమని చెప్పడంతోపాటు తనపట్ల దురుసుగా ప్రవర్తించారంటూ సీపీ శంఖబ్రతబాగ్చికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపించారు. ఏఎస్ఐ దురుసుగా ప్రవర్తించిన విషయం వాస్తవమేనని నిర్ధారణ కావడంతో సతీష్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ నిర్ణయం తీసుకున్నారు.

గ్రీన్ బెల్ట్‌లో వైఎస్ విగ్రహం!

- అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి ఏర్పాటు
- గతంలో మాదిరిగానే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేతలు



గ్రీన్‌బెల్ట్ స్థలంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటుచేసిన దృశ్యం

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ నేతలు గతంలో మాదిరిగానే కూటమి ప్రభుత్వంలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని అక్కయ్యపాలెం జంక్షన్‌లో గల గ్రీన్‌బెల్ట్ స్థలంలో ఆదివారం రాత్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఏర్పాటుచేసేశారు. అక్కడ ఏడాది క్రితం చెట్లు తొలగించి భారీ దిమ్మ నిర్మించి 100 అడుగుల ఎత్తులో వైసీపీ జెండా ఎగురవేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అధికారులు అక్కడ జెండాను తొలగించారు. ఆ స్థానంలో జాతీయ జెండా ఎగురవేయాలని టీడీపీ నేతలు, స్థానికులు భావించారు. అందుకు జీవీఎంసీ అధికారులు అనుమతించలేదు. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు, ఆయన అనుచరులు ఆదివారం రాత్రి హడావిడిగా దిమ్మ నిర్మించి ... మిగతా 6వ పేజీలో

బదిలీల సందడి

- ఏ కార్యాలయంలో చూసినా అదే చర్చ
- ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న ప్రతి ఒక్కరినీ బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశం
- రిజిస్ట్రేషన్స్ శాఖలో రెండేళ్లు దాటిన వారి నుంచి వినతులు
- జోరుగా పైరవీలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఏ కార్యాలయానికి వెళ్లినా బదిలీలపైనే చర్చ నడుస్తోంది. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న ప్రతి ఒక్కరినీ బదిలీ చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే కొన్ని శాఖల ఉన్నతాధికారులు తెలివిగా ఒక స్థానంలో రెండేళ్లు దాటినవారు కూడా బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని చెబుతున్నారు. దీంతో వారికి కావలసిన వారికి బదిలీలు చేసుకోవడానికి అలా చేస్తున్నారనే ప్రచారం మొదలైంది. ప్రభుత్వానికి ఆదాయం తీసుకువచ్చే రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖలకు ప్రత్యేకంగా జీఓలు ఇచ్చారు. ఇవి ప్రభుత్వంతో పాటు అందులో పనిచేసే ఉద్యోగులకు కూడా ఆదాయం సమకూర్చేవి కావడంతో కీలకమైన స్థానాల కోసం పలువురు పోటీ పడుతున్నారు. రాజకీయ సిఫారసులతో పాటు ఆ శాఖలో ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడానికి దారి వెదుక్కుంటున్నారు.

జిల్లా వాణిజ్య పన్నుల శాఖలో రూ.300 కోట్ల కుంభకోణం జరిగింది. వ్యాపారులతో సర్కిల్ అధికారులు లాలూచీ పడి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. ఉన్నత స్థాయిలో విచారణ చేసి పలువురిని ఇక్కడి నుంచి బదిలీ చేశారు. జాయింట్ కమిషనర్ పోస్టు ప్రస్తుతం ఖాళీగా ఉంది. గతంలో చక్రం తిప్పిన వారే మళ్లీ విశాఖ జిల్లాకు రావాలని ప్రయత్నం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖలో ఐదేళ్లతో పాటు రెండేళ్లు దాటిన వారి నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించారు. కౌన్సెలింగ్ నిర్వహిస్తారా?, నేరుగా నియామకం చేస్తారా? అనేది తెలియదు. అందరి పనితీరుపై నివేదికలు కూడా తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జోన్-1లో భీమిలి రిజిస్ట్రార్‌ని, ఎస్.కోట రిజిస్ట్రార్‌ని సస్పెండ్ చేశారు. అలాగే సూపర్‌బజారు కార్యాలయంలో జాయింట్-2 పోస్టు ఖాళీగా ఉంది. వీటిని భర్తీ చేయనున్నారు. పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఎనీవేర్ రిజిస్ట్రేషన్లు ఎవరు తిరస్కరించినా ఆయన మాత్రం చేస్తారనే పేరు తెచ్చుకున్నారు. దాంతో అధికారులు కొద్దికాలం పక్కన పెట్టారు. ప్రస్తుతం ఆయన సెలవులో ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్‌తోనే నడిపిస్తున్నారు. ఇలాంటి స్థానాలు కూడా భర్తీచేసే అవకాశం ఉందని అంటున్నారు.

ఈపీడీసీఎల్‌లోను బదిలీలకు దరఖాస్తులు ఆహ్వానించారు. వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చాలామంది సిటీకి రావాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈపీడీసీఎల్‌లో పూర్తిగా రాజకీయ పైరవీలతోనే కీలకమైన సీట్లు దక్కుతాయనేది జగమెరిగిన సత్యం. కొందరు ఉన్న స్థానాల్లోనే కొనసాగడానికి యత్నిస్తుండగా, మరికొందరు కొత్త స్థానాలు కోరుకుంటున్నారు. ఈపీడీసీఎల్ ఐదు జిల్లాల పరిధిలో ఉండగా అన్ని జిల్లాల ప్రజా ప్రతినిధులు ... మిగతా 6వ పేజీలో

విశాఖ కోసం వంశధారలో రెండు ఇసుక రీచ్‌లు - వార్త 6వ పేజీలో

ఆంగ్లంలోనే పరీక్షలు

- నేటి నుంచి ప్రారంభం
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇబ్బందే...
- మండల కేంద్రాల నుంచి ప్రశ్నపత్రాల పంపిణీ
- దశల వారీగా తెలుగు మాధ్యమం ఎత్తేసిన గత వైసీపీ ప్రభుత్వం



విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో సుమారు 80 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నుంచి స్వీయ మదింపు పరీక్షలు (సెల్ఫ్ అసెస్‌మెంట్ టెస్ట్/ఫస్ట్ యూనిట్ టెస్ట్) ప్రారంభం కానున్నాయి. అయితే పాఠశాల విద్యా శాఖ చరిత్రలో తొలిసారిగా పరీక్షలు ఆంగ్లంలోనే జరగనున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బోధన మొత్తం ఆంగ్లంలోనే నిర్వహిస్తున్నారు. అందుకే పరీక్షలు కూడా ఆంగ్లంలోనే రాయాలని విద్యార్థులకు సూచించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007-08లో ఆంగ్ల మాధ్యమం ప్రారంభించారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో సెక్షన్లు ఉండేవి. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ బడుల్లో దశల వారీగా తెలుగు మాధ్యమం ఎత్తివేసేలా ప్రణాళిక అమలుచేసింది. 2024-25 సంవత్సరం నుంచి పూర్తిగా ఆంగ్లంలో బోధన, పరీక్షలు నిర్వహించేలా నిర్దేశించింది. దీనిపై భాషావేత్తలు, ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చినా పట్టించుకోలేదు. అదే సమయంలో ఆంగ్ల మాధ్యమంలో బోధన, పరీక్షలకు పిల్లలను సన్నద్ధం చేయడంలో విఫలమైంది. గ్రామీణ ప్రాంతంలో ఎక్కువ మంది విద్యార్థులకు ఆంగ్లంలో బోధిస్తే అర్థం కాదు...ఇక ఆంగ్లంలో పరీక్షలు రాయడం అంటే మరింత ఇబ్బందికరమనే వాదన ఉంది. ప్రస్తుత ఏడాది విద్యార్థులకు ఇచ్చిన పాఠ్యపుస్తకాలు ద్విభాష (ఇంగ్లీష్, తెలుగు)లో ముద్రించారు. తరగతి గదుల్లో ప్రధానంగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మాతృభాషలోనే బోధన చేస్తున్నారు. చివరకు ఉన్నత పాఠశాలల్లో ఎక్కువ మంది పిల్లలకు తెలుగు మీడియంలో బోధన చేస్తేనే అర్థమవుతుందని తెలిసినా ఎవరూ ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం లేదు. విచిత్రమేమిటంటే...ఒరియా, ఉర్దూ మాధ్యమంలో చదువుకునే పిల్లలు ఆయా భాషల్లో పరీక్షలు రాసుకునే వెసులుబాటు ఉంది.కానీ తెలుగు మాట్లాడే మన పిల్లలకు మాతృభాషలో పరీక్షలు రాసుకునే అవకాశం ఇవ్వడం లేదు.దీనిపై ఉపాధ్యాయుల్లో అసంతృప్తిలో ఉన్నా ఎవరూ బయటకు చెప్పడం లేదు.

నేటి నుంచి పరీక్షలు...

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల ... మిగతా 6వ పేజీలో

కూటమి కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అక్కయ్యపాలెం, ఆగస్టు 26: గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కార్యాలయాన్ని సోమవారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఎంపీ ఎం.శ్రీభరత్, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, దక్షిణ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, నేతలు అకిరెడ్డి జగదీష్, కన్నం వెంకట రమణారావు, గురుగోవింద్ సింగ్, కుంతీ దేవి, ముక్కి రామకృష్ణ, దువ్వి కాశీప్రసాద్, జేకే, ముప్పాళ్ళ శ్రీకృష్ణ, ఎంఎల్ఎన్ రావు, నాగమణి పాల్గొన్నారు.

30న ఐటీఐలో జాబ్‌మేళా

కంచరపాలెం, ఆగస్టు 26: కంచరపాలెం బాలికల ఐటీఐ నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 30వ తేదీ శుక్రవారం నిరుద్యోగ యువతకు జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు సబ్ రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. ఎస్ఆర్ అకడమిక్ ఆర్గనైజేషన్, శ్రీరామ్ చిట్స్ తదితర సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఎస్‌బీఐ కార్డ్స్ స్టోర్ ఎగ్జిక్యూటివ్ ,ఆడిట్ డిపార్టుమెంట్, టెలీకాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తదితర ఉద్యోగాలను భర్తీ చేస్తారన్నారు. అభ్యర్థులు పదోతరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. తమ వివరాలను ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆసక్తి, అర్హత గల వారు 30వ తేదీ ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని శ్యాంసుందర్ కోరారు.

గ్రామ కమిటీకి అభినందనలు



కమిటీ సభ్యులను అభినందిస్తున్న కార్పొరేటర్ కవిత

కంచరపాలెం, ఆగస్టు 26: జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్-5 గ్రామ కమిటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఇందులో భాగంగా జైభారత్ యువజన సేవాసంఘం అధ్యక్షుడిగా రాజాన చిన్నబాబు, కార్యదర్శిగా కందికుప్ప త్రినాథ్, ట్రెజరర్‌గా చల్లా లక్ష్మీపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సోమవారం కార్పొరేటర్ గంకల కవిత అప్పారావును కలిసింది. వారిని కార్పొరేటర్ సత్కరించి అభినందించారు. గ్రామాభివృద్ధికి కృషిచేయాలని కోరారు.



మురళీనగర్‌లో వేడుకలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



వన్‌టౌన్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సీతమ్మధార, ఆగస్టు 26: స్థానిక శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని ప్రతిమ వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీకృష్ణ గానామృతంతో కూడిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం కృష్ణ కుచేల స్నేహానికి సంబంధించి నాటికను ప్రదర్శించారు. నర్సరీ నుంచి రెండోతరగతి విద్యార్థుల వరకు నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ ప్రదర్శనలో కృష్ణ, బలరామ, యశోద, కంశుడు, మీరాబాయి, కుచేలుడు, రాధ, రుక్మిణి, సత్యభామ వేషాలను ధరించి చిన్నారులు కనువిందు చేశారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్ శుభాకాంక్షలు తెలిపారు.

వన్‌టౌన్‌లో...

జగదాంబ కూడలి: వన్‌టౌన్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణతో అలరించారు. కృష్ణుడి విగ్రహం వద్ద ఎమ్మెల్యే, కూటమి శ్రేణులు పూజలు చేశారు. చిన్నారులకు సంస్థ ప్రతినిధి సూరి అప్పారావు సమకూర్చిన చిన్నికృష్ణుడి ఫొటోలను ఎమ్మెల్యే అందజేశారు. పాతనగరం లక్ష్మీటాకీస్ ఆంజనేయస్వామి గుడి వద్ద కృష్ణాష్టమి సందర్భగా అన్న ప్రసాద వితరణ చేశారు.

సీతంపేట రాధాకృష్ణ మందిరంలో

సీతంపేట: సీతంపేట కూడలి రాధాకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి నిర్వహించారు. దేవతా మూర్తులను వెండి కిరీటాలు, పూలదండలు, తులసి మాలలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పూజలు చేశారు. ఇసరపు అప్పారావు, ఇసరపు వెంకటలక్ష్మి, ఇసరపు వాసు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో

విశాఖపట్నం: యదువంశీ రైల్వే ఎంప్లాయిస్ స్పిరిట్యుయల్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్మాష్టమి వేడుకలు జరిగాయి. న్యూకాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపానికి స్వామి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పాల్గొన్నారు.

వైశాఖీ స్పోర్ట్స్ పార్క్‌లో

మురళీనగర్: స్థానిక వైశాఖీ స్పోర్ట్స్ పార్క్‌లో కృష్ణాష్టమి వేడుకలు పార్కు కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, సెక్రటరీ సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరిగాయి. చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఉట్టి సంబరం జరిపారు. ఎంఎస్ఆర్ పార్కులో మాధవనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పోర్టు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు కృష్ణుడి విగ్రహానికి పూలమాల వేశారు. చిన్నారుల రాధా, కృష్ణుల వేషధారణతో అలరించారు.

జిల్లా పరిషత్ జంక్షన్‌లో...

మహారాణిపేట: జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న కృష్ణ చైతన్య మఠంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు. చిన్నారులను రాధా కృష్ణులుగా అలంకరించిన పలువురు తల్లిదండ్రులు వారిని ఆలయానికి తీసుకువచ్చి, అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



కృష్ణుడు, గోపికల వేషధారణలో శ్రీప్రకాష్ చిన్నారులు



న్యూకాలనీ వద్ద జరిగిన వేడుకల్లో డీఆర్ఎం

కేంద్రీయ విద్యాలయంలో...

అక్కయ్యపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు కృష్ణుడు, రాధ వేషధారణలు ధరించి అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కృష్ణాష్టమి విశిష్టతను ఉపాధ్యాయని ప్రగతి వివరించారు. ప్రిన్సిపాల్ కమల్‌జిత్, హెచ్ఎం ఎం.శైలజ, వై.విజయలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 27న ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 26: శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నవంబరు 27 నుంచి ఇంటర్నేషనల్ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. టోర్నీ పోస్టర్‌ను సోమవారం విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని జీవీఎంసీ ఎస్-3 స్పోర్ట్సు ఎరీనా వేదికగా ఆరు రోజుల పాటు జరిగే టోర్నీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆలిండియా చెస్ సమాఖ్య, ఏపీ చెస్ సంఘం, విశాఖ శాఖ సంఘం పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయని, వివిధ ప్రాంతాల రేటింగ్ క్రీడాకారులు పాల్గొనే ఈ టోర్నీలో విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రంగాల బాబూరావు వివరించారు. ఈ కార్యక్రమంలో చెస్ సంఘం ప్రతినిధులు ఏ.సురేష్, ఎస్.మణికంఠరావు, డాక్టర్ రామానుజస్వామి, ఎస్3 స్పోర్ట్సు ఎరీనా నిర్వాహకులు సుహాని సుమన్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

క్రీడలతో మానసికోల్లాసం

» వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖపట్నం, ఆగస్టు 26: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. వీఎంఆర్డీఏ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్-2024లో భాగంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జిమ్నాజియం ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ఆయన మాట్లాడుతూ క్రీడలు ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. సంస్థ కార్యదర్శి దాట్ల కీర్తి, సంయుక్త కమిషనర్ వి.రవీంద్ర, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్ శాంతిస్వరూప్, ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు సేవలు అభినందనీయం

» దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



వధూవరులకు కానుకలు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతంపేట, ఆగస్టు 26: పేదలకు తనవంతు సాయమందించాలని నిత్యం పరితపించే 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు సేవలు అభినందనీయమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రశంసించారు. జనసేన నగర పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన వధూవరులను ఎమ్మెల్యే ఆశీర్వదించి వారికి కార్పొరేటర్ సమకూర్చిన పట్టువస్త్రాలు, తాళిబొట్లు, పెళ్లికి అయ్యే ఖర్చు, రిజిస్ట్రేషన్ ఖర్చులను అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజును అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మురళీనగర్ పోస్టాఫీసు తెరిపించాలి



ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం ఇస్తున్న 50వ వార్డు టీడీపీ నేతలు

మాధవధార, ఆగస్టు 26: గ్రేటరు 50వవార్డు మాధవధార హైస్కూలు పక్కన ఉన్న పోస్టాఫీసును ఇటీవల మూసివేశారు. దీనిని తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సోమవారం 50వవార్డు టీడీపీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, న్యాయవాది ఎస్.నరసింహ ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందించారు. అధిక శాతం రిటైర్డు ఉద్యోగులున్న మురళీనగర్, మాధవధార ప్రాంతంలో ఖాతాల నిర్వహణతో పాటు, తపాలా సేవలు, విద్యార్థులతో పాటు బాలికా సంరక్షణ పథకాలు, పొదుపు ఖాతాలు నిర్వహించేవారని, పోస్టాఫీసు మూసివేయడంతో సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఇక్కడ తిరిగి పోస్టాఫీసు ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ సహా టీడీపీ నేతలు కోరారు.

కలెక్టరేట్‌లో పరిశుభ్రతా చర్యలు



కలెక్టరేట్ ఆవరణలో తుప్పలను తొలగిస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పెరిగిన పొదలను సోమవారం తొలగించారు. కార్యాలయం వెనుకభాగం, భవనాల మధ్యన వర్షాకాలంలో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను ఎక్సకవేటర్‌తో తొలగించారు. చెత్త, గోడలపై పెరిగిన మొక్కలు తొలగించడంతో పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. పొదలు పెరగడంతో పాములు, పురుగులు వస్తాయని సిబ్బంది ఆందోళన వ్యక్తంచేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు కార్యాలయ ఆవరణ మొత్తం శుభ్రం చేయించారు.

మదర్ థెరిసా సేవలు నేటి తరానికి ఆదర్శం

» ఉత్తర ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, ఆగస్టు 26: మదర్ థెరిసా సేవలు ఆదర్శమని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు కొనియాడారు. థెరిసా 141వ జయంతి వేడుకలను సోమవారం గ్రేటర్ 47వవార్డులో నిర్వహించారు. కప్పరాడ-2 వద్ద ఏర్పాటు చేసిన థెరిసా విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ విదేశాల్లో జన్మించి భారత్‌కు వచ్చి మురికివాడల్లోని నిరుపేదలకు థెరిసా అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రాజారావు, శ్రీను, అరుణమ్మ, అరుణ్, ఫణి, కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో...

మహారాణిపేట: సేవా మూర్తి మదర్ థెరిసా జయంతిని జనసేన నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ జంక్షన్‌లో నేతలు మన్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలను, అనాధలను చేరదీసి మానవత్వానికి మరణం లేదని చాటి చెప్పిన మాతృమూర్తి మదర్ థెరిసా అని అన్నారు. ఆమె సేవా గుణాన్ని యువత అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



థెరిస్సా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

విశాఖ కోసం వంశధారలో రెండు ఇసుక రీచ్‌లు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నగరవాసుల అవసరాల కోసం శ్రీకాకుళం జిల్లాలో రెండు ఇసుక రీచ్‌లను అధికారులు కేటాయించారు. వంశధార నది సమీపాన రెండుచోట్ల ఇసుక మేటలను గుర్తించిన శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం వాటిని విశాఖకు ఇవ్వాలని నిర్ణయించింది. రెండుచోట్ల సుమారు 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంటుందని అంచనా వేస్తున్నారు. వంశధార నదిలో పలుచోట్ల రీచ్‌లను శ్రీకాకుళం జిల్లా జల వనరుల శాఖ అధికారులు గుర్తించగా వాటిలో రెండింటిని విశాఖపట్నం జిల్లాకు ఇచ్చారు. నగరానికి నెలకు 30 నుంచి 35 వేల టన్నుల ఇసుక అవసరమని అంచనా వేస్తున్నారు. వంశధారలో ఇసుక తవ్వకాలకు కేంద్రం అనుమతి ఇచ్చిందని, గోదావరి నది నుంచి ఇసుక తరలింపునకు కూడా త్వరలో గ్రీన్‌సిగ్నల్ వస్తుందని అధికారులు చెబుతున్నారు. వంశధారలో ఇసుక మూడు, నాలుగు నెలలకు సరిపోతుందని, అప్పటికి గోదావరి నుంచి ఇసుక తరలింపునకు అనుమతి వస్తుందని అంటున్నారు. నగర పరిసరాలు, ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేకపోవడంతో వంశధార, గోదావరి నదులపై ఆధారపడాల్సి వస్తోంది.

కాగా అగనంపూడిలో ఇసుక అమ్మకాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు మూడు రోజుల నుంచి పినమడక గ్రామ సచివాలయంలో సొమ్ము చెల్లించి రశీదు తీసుకువెళితే డిపోలో డెలివరీ ఇస్తున్నారు. దీంతో రోజుకు 1,200 నుంచి 1,400 టన్నుల మాత్రమే వెళుతుంది. ప్రస్తుతం డిపోలో 40 వేల నుంచి 45 వేల టన్నుల ఇసుక ఉంది. అగనంపూడి డిపోలో ఇసుక మరో నెల రోజుల వరకూ సరిపోతుందని, ఈలోగా అమ్మకాలకు ఆన్‌లైన్ విధానం అమలులోకి వస్తోందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

'సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలి'

డాబాగార్డెన్స్, ఆగస్టు 26: సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలని ఏపీ బ్యాంకు విశ్రాంత ఉద్యోగ సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీవీవీ కొండలరావు, ఎ.ఎల్లారావు పిలుపునిచ్చారు. జిల్లా బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య సమావేశాన్ని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ సవరణ, బీమా ప్రీమియం తగ్గింపు, ఫామిలీ పెన్షన్ పెంపుదల, ఆరోగ్య బీమాపై జీఎస్టీ తగ్గింపు తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సమాజ సేవలో విశ్రాంత ఉద్యోగులు తమవంతు పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమానికి ఆర్.వి.రవికుమార్ స్వాగతం పలుకగా కె.కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. పి.వీరారెడ్డి, వి.జగన్‌మోహనరావు, జి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విశ్రాంత ఉద్యోగ సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎ.కోటేశ్వరరావు, అధ్యక్షుడిగా పి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వి.రవికుమార్, ఉపాధ్యక్షులుగా ఐ.కేశవరావు, జి.రామచంద్రరావు, పి.రాఘవరావు, ఎం.ఎస్.భాస్కరరావు, సాగర్, ఎస్పీ మృత్యుంజరావు, 25 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

పాత వారికే పట్టం!

... 5వ పేజీ తరువాయి

అమరావతి పెద్దలు విశాఖ జిల్లా నాయకులను సంప్రతించడం లేదని, అందుకే ఇలాంటి నిర్ణయాలు వెలువడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కింది నుంచి పైవరకూ ఒక సామాజికవర్గం వారికే పదవులు ఇచ్చుకొన్నారు. ఇప్పుడు సామాజిక వర్గాలను పక్కన పెట్టినా ఆ బృందానికే పదవులు ఇవ్వడం ఏమిటనే చర్చ జరుగుతోంది.

బీఎస్ఎన్ఎల్ జోష్

... 5వ పేజీ తరువాయి

టవర్లను దేశవ్యాప్తంగా ఏర్పాటుచేస్తోంది. జిల్లాలో ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌కు ప్రీ, పోస్టు పెయిడ్ వినియోగదారులు 4.3 లక్షల మంది ఉన్నారు. వీరిలో 30 వేల మంది పోస్ట్ పెయిడ్ వినియోగదారులు కాగా, మిగిలిన నాలుగు లక్షల మంది ప్రీ పెయిడ్ వినియోగదారులు. రానున్న రెండు, మూడు నెలల్లో వినియోగదారుల సంఖ్య ఐదు లక్షలు దాటే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

బదిలీల సందడి

... 5వ పేజీ తరువాయి

విశాఖలోని వివిధ జోన్లలో పోస్టులకు సిఫారసులు చేస్తుండడం గమనార్హం.

వీఎంఆర్‌డీఏలో సెక్రటరీ పోస్టులో ఉన్న అధికారిణి ఆర్‌డీఓగా వేరే జిల్లాకు వెళతారని ప్రచారం జరుగుతోంది. ఆ స్థానంలోకి రావడానికి ప్రస్తుతం సింహాచలం దేవస్థానంలో ఈఓగా పనిచేస్తున్న శ్రీనివాసమూర్తి, అలాగే గతంలో వీఎంఆర్‌డీఏలోనే ఎస్టేట్ అధికారిగా పనిచేసి గోదావరి జిల్లాలో ఆర్‌డీఓగా ఉన్న వసంతరాయుడు ప్రయత్నిస్తున్నారు. విశాఖ జిల్లాలో పలు మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేసి డిప్యూటీ కలెక్టర్ హోదాలో ప్రస్తుతం అమరావతిలోని సీసీఎల్ఏలో పనిచేస్తున్న వేణుగోపాల్ కూడా సెక్రటరీగా రావాలని అనుకుంటున్నారు. ఆయన గతంలో కొద్ది నెలలే పనిచేసినా సంస్థను గాడిలో పెట్టేందుకు చేసిన ప్రయత్నాలు సఫలం కావడంతో అవకాశం ఉందని అంటున్నారు. జాయింట్ కమిషనర్‌గా రవీంద్ర వచ్చి మూడేళ్లు కావస్తుండడంతో ఆయన్ను మారుస్తారని ప్రచారం జరుగుతోంది. ఆ స్థానంలో గతంలో ఇక్కడే పనిచేసిన రమేశ్ వస్తారని అంటున్నారు.

గ్రీన్ బెల్ట్‌లో వైఎస్ విగ్రహం!



విగ్రహం ఏర్పాటుపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

... 5వ పేజీ తరువాయి

రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటుచేశారు. తెలుగుదేశం నాయకులు సోమవారం ఈ విషయం గుర్తించి జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేశారు. అనధికారికంగా విగ్రహం ఏర్పాటుపై సోమవారం రాత్రి నాలుగో పట్టణ పోలీసులకు విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకులు ఫిర్యాదు చేశారు. ప్రశాంతంగా ఉండే అక్కయ్యపాలెంలో వైసీపీ నాయకులు కావాలనే రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదుచేయాలని నిర్ణయించారు.

అవినీతి ఖాకీలపై నిఘా

... 5వ పేజీ తరువాయి

చేశారని చెబుతున్నారు. దీనిపై చర్చ జరుగుతుండగానే మల్కాపురం స్టేషన్‌లోని మహిళా ఎస్ఐ దేముడమ్మ ఒక కేసులో నిందితులను అరెస్టు చేయకుండా ఉండడానికి రూ.30 వేలు డిమాండ్ చేయడం, అడ్వాన్సుగా రూ.పది వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరకడం జరిగింది. దీంతో పోలీసుల అవినీతి మరోసారి ఆధారాలతో వెలుగులోకి వచ్చినట్టయింది. ఈ నేపథ్యంలో సీపీ శంఖబ్రత బాగ్చి శాఖలో అవినీతిపరులపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయడంతోపాటు సమాచారం సేకరిస్తున్నట్టు సమాచారం. ప్రత్యేకంగా ఒకరిద్దరు అధికారులకు ఈ బాధ్యత అప్పగించినట్టు ప్రచారం జరుగుతంది. వారిచ్చే నివేదికతోపాటు ఆధారాలు లభిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీపీ నిర్ణయించినట్టు పోలీస్ శాఖలోని ఒక అధికారి పేర్కొన్నారు.

ఆంగ్లంలోనే పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులకు మంగళవారం నుంచి వచ్చే నెల నాలుగో తేదీ నుంచి స్వీయ మదింపు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి ప్రతిరోజు ప్రశ్నపత్రాలు పంపిస్తారు. తొలిరోజు మంగళవారం సింహాచలంలో ఓరియంటల్ పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు, 28వ తేదీ నుంచి వచ్చే నెల నాలుగోతేదీ నుంచి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ప్రశ్నపత్రాలు లీకేజీకి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సంబంధిత యాజమాన్యాలు నిర్వహిస్తాయి.

యమపాశాలుగా మారుతున్న విద్యుత్ వైర్లు!

జనావాసాల మీదగా ఉన్న వైర్లతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న 70, 71, 72 వార్డుల ప్రజలు

అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు



71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో నివాసాలకు చేరువలో ఉన్న విద్యుత్ వైర్లు

కూర్మన్నపాలెం, ఆగస్టు 26: జనావాసాల మీదుగా ఉన్న హై టెన్షన్ (హెచ్‌టీ) విద్యుత్ వైర్లు స్థానికంగా నివాసం ఉంటున్న వారికి యమపాశాలుగా మారు తున్నాయి. విద్యుత్ వైర్ల మూలంగా కుటుంబ సభ్యులతో కాసేపు సరదాగా డాబాపై గడుపుదామన్నా వీల్లేకుండా పోతుందని స్థానికులు భీతిల్లుతున్నారు. 71వ వార్డు శ్రీనగర్ సమీపంలోని దిబ్బపాలేనికి చెందిన దీపేశ్ అనే తొమ్మిదేళ్ల బాలుడు ఆడుకునేందుకు శనివారం సాయంత్రం డాబాపైకి వెళ్లడం.. తన చేతిలో ఉన్న ఇనుప తీగ వంటిది విద్యుత్ వైరుకు తగలడంతో షాక్‌కు గురై ఆదివారం మృతి చెందిన సంగతి తెలిసిందే.

కాగా ఇదే వార్డులోని సుందరయ్య కాలనీలో గతంలో కేబుల్ కనెక్షన్ ఇస్తున్న అధిక ఓల్టేజ్ గల విద్యుత్ తీగలు తగలడంతో ఓ వ్యక్తికి ఎడమ చెయ్యి, ఛాతీ భాగం కాలి పోయింది. అంతకాక ఆ సమయంలో పెద్ద శబ్దం రావడంతో సమీపంలో ఉన్న నాలుగు ఇళ్లల్లోని విద్యుత్ మీటర్లు, వైరింగ్, ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిడ్జిలు వంటివి కాలిపోయాయి. అదేవిధంగా 70వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లో ఇటీవల నాయుడు, కొండలరావు అనే వ్యక్తుల ఇళ్లకు హై టెన్షన్ విద్యుత్ వైర్లు తగలడంతో ఆ ప్రాంతంలో చాలా ఇళ్లల్లో మీటర్లు, గృహ వినియోగ ఎలక్ట్రిక్ సామాన్లు దగ్ధమయ్యాయి. పలు ఇళ్లల్లోని టీవీలు, ఫ్రిడ్జిలు, ఫ్యాన్లు కాలిపోవడంతో ప్రజలు లబోదిబోమన్నారు. హెచ్‌టీ విద్యుత్ వైర్ల మూలంగా ఇటీవలే ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇటువంటి దుర్ఘటనలు గతంలో పలుచోట్ల చోటుచేసుకున్నాయి. కాగా అఫీషియల్ కాలనీలో ఓ ఇంటిపై నిర్మాణ పనులు జరుగుతుండగా నీరు హెచ్‌టీ విద్యుత్ లైన్లపై పడడంతో పెద్ద పేలుడు సంభవించి మంటలు వ్యాపించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు.

70, 71, 72 వార్డులలో..

జీవీఎంసీ 70, 71, 72 వార్డుల్లో హెచ్‌టీ విద్యుత్ వైర్ల తొలగింపు తమ చేతుల్లో లేదని ఏపీఈపీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. ఆయా వార్డుల్లోని పరిస్థితులను పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించామని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. శ్రీనగర్, ఎల్‌వీ నగర్, పాత కర్ణవానిపాలెం, డ్రైవర్స్ కాలనీ, శ్రామిక నగర్, కుంచుమాంబ కాలనీ, ఎర్రగడ్డ కాలనీ, చిన గంట్యాడ, అఫీషియల్ కాలనీ, శ్రీరామ్ నగర్, సుందరయ్య కాలనీ, దుర్గా నగర్, అరుణోదయ కాలనీ వాసులకు 133కేవీ, 33 కేవీ విద్యుత్ లైన్లు శాపంగా మారాయని, వాటిని తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సుందరయ్య కాలనీలో ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్న వైర్లు

ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నాం

దశాబ్దాల కాలంగా హెచ్‌టీ విద్యుత్ వైర్లతో ఇబ్బందులు పడుతున్నాం. ఆదివారం తొమ్మిదేళ్ల బాలుడు ఈ వైర్ల మూలంగా మృతి చెందాడు. సంబంధిత అధికారులకు ఎన్నిమార్లు మొర పెట్టుకున్నా పైనుంచి తమకు ఆదేశాలు రావాలంటున్నారే సమస్య పరిష్కారానికి కృషి చేయడం లేదు. ప్రమాదాలకు ఆలవాలంగా ఉన్న హెచ్‌టీ విద్యుత్ వైర్ల నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ వైర్ల మూలంగా తరచూ ఇళ్లల్లోని విద్యుత్ ఉపకరణాలు ధ్వంసమవుతున్నాయి. దీంతో వానొచ్చినా, గాలులు వీచినా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం.



ఎలుగుబంటి నరసింగరావు, దిబ్బపాలెం



గృహాలకు మధ్యలో ఉన్న హెచ్‌టీ విద్యుత్ లైన్లు



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్

అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ మాదే..

బీజేపీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ రామ్మోహన్

గాజువాక, ఆగస్టు 26: ప్రపంచంలో అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ తమదేనని భారతీయ జనతా పార్టీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ రామ్మోహన్ అన్నారు. గాజువాకలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు మూడు నుంచి 25వ తేదీ వరకు తొలి విడత సాధారణ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రపంచంలో ఏ పార్టీకి లేని విధంగా బీజేపీకి అధిక సభ్యతం ఉండడం ఆనందంగా ఉందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందన్నారు. పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి పుట్టా గంగయ్య, నాయకులు గూటూరు శంకరరావు, బాటా శ్రీను, రంగనాయకులు, తేజస్విని, నాగరాజు, విశ్వనాథం, వెంకటరమణ, లత, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు ఒకటినే జీతాలు ఇవ్వాలి

ఉక్కు సీజీఎం (వర్క్స్) యు.శ్రీధర్‌ను కోరిన ఏఐటీయూసీ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 26: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు ఉక్కు సీజీఎం (వర్క్స్) యు.శ్రీధర్‌ను కోరారు. సీజీఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల ఇబ్బందులును దృష్టిలో ఉంచుకొని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాంట్ ప్రగతికి తీసుకునే చర్యలకు యూనియన్ తరుపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బూసి వెంకటరావు, యేల్లేటి శ్రీనివాసరావు, సత్తిరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు నివాళి



నెల్లిముక్కు రోడ్డులో మదర్ థెరిసాకు నివాళులర్పిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ, ఆగస్టు 26: మదర్ థెరిసా జయంతిని సోమవారం నెల్లిముక్కు రోడ్డులో ప్రేమనిధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు అంజూరి దీపక్, కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, న్యూపోర్టు ట్రాఫిక్ ఏఎస్ఐ ఉమామహేశ్వరరావులు థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దీపక్ మాట్లాడుతూ థెరిస్సా ఆశయాలకు అనుగుణంగా అందరూ సేవా భావంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు యెల్లేటి శ్రీనివాసరావు, జి.గురుమూర్తి, డి.అప్పారావు, కె.ముసలయ్య, చినఅప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: అగనంపూడి కూడలిలో ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి అఖిలపక్ష నాయకులు పూలమల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతోమందికి ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన మహోన్నత వ్యక్తి థెరిసా అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కరణం సత్యారావు, కె.తాతారావు, ఈశ్వరరావు, ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర వైద్య కళాశాలకు భౌతికకాయం అందజేత



వరలక్ష్మి భౌతికకాయాన్ని ఏఎంసీకి అందజేస్తున్న కుటుంబ సభ్యులు

విశాఖపట్నం, ఆగస్టు 26: వడ్లపూడి కాలనీకి చెందిన శరీరదాత జి.వరలక్ష్మి (74) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందడంతో ఆమె భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు ఆంధ్ర వైద్య కళాశాలకు అందజేశారు. అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్ ఆమె భౌతికకాయాన్ని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మృతురాలి కుటుంబ సభ్యులతో పాటు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి. పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నోటీసులు పంపడంపై గ్రామస్థుల ఆందోళన

పెందుర్తి, ఆగస్టు 26: మండలంలోని వాలిమెరక జుత్తాడలో సర్వే నంబర్ 58-2లో పన్నెండేళ్లుగా కుటుంబాలతో ఆవాసాలు ఏర్పరుచుకుని ఉంటున్న స్థలాలను ఆక్రమించామంటూ తమకు నోటీసులు పంపడం భావ్యం కాదని పలువురు గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ వారు డిమాండ్ చేశారు. సోమవారం జుత్తాడలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఇక్కడ ఉంటున్న 30 కుటుంబాల నివాసాలకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. తమకు నివాసిత హక్కు కల్పించాల్సిందిగా పలుమార్లు రెవెన్యూ అధికారులకు అర్జీలు సమర్పించామన్నారు. అయితే ఇప్పుడు నోటీసులు జారీ చేయటంతో తాము తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

భూ బాధితుల సదస్సును సక్సెస్ చేయాలి



జైయాంధ్ర కాలనీలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మల్కాపురం, ఆగస్టు 26: విజయవాడలో ఈ నెల 28వ తేదీన జరగనున్న భూ బాధితుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక జైయాంధ్ర కాలనీలో వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భూ బకాసురుల చేతిలో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. పేదల భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుడాల రాంబాబు, ఎన్వీ త్రినాథ్, శ్రీనివాస్, వెంకటరమణ, వెంకట కనకరాజు, గోపి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 28న విజయవాడలో భూ బాధితుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం స్థానిక బర్డన్ కాలనీలో ఆవిష్కరించారు. ఈ సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు ఆర్.శ్రీనివాసరావు, అసిరినాయుడు, ఎర్రిపల్లి రాంబాబు, తదితరులు కోరారు.

అప్పికొండ బీచ్‌కు బస్సు పునరుద్ధరణ



బస్సును ప్రారంభించిన దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 26: అప్పికొండ బీచ్‌కు బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. ఈ బస్సును సోమవారం అప్పికొండలో దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రెండు గంటలకూ గాజువాక నుంచి అప్పికొండకు ఈ బస్సు నడుస్తుందన్నారు. గతంలో ఇలా ఉన్న సర్వీసును అధికారులు కొన్ని కారణాల వల్ల తొలగించారు. మళ్లీ ఇప్పుడు ఈ బస్సును పునరుద్ధరించడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇంటి ప్రహరీ గోడ



కొత్తపాలెంలో కూలిన ప్రహరీ గోడ

గోపాలపట్నం, ఆగస్టు 26: వర్షానికి ఇంటి ప్రహరీ గోడ కూలిన సంఘటన 89వ వార్డు పరిధి కొత్తపాలెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. సోమవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి కొత్తపాలెం గ్రామ కూడలిలోని నాగేంద్ర కాలనీ జంక్షన్‌లో బి.రామానందం అనే వ్యక్తి ఇంటి ప్రహరీ గోడ ఒక్కసారిగా కూలిపోయింది. అయితే ఈ ప్రమాదం తెల్లవారు జామున జరగడంతో ఎవరికీ ఏమీ కాలేదు.

సినిమా గైడ్

- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** సంగం, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), విశేష్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **తంగలాన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), తాతా (తగరపువలస)
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, శ్రీకన్య (గాజువాక)
- **ఆర్.కె.పురంలో :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 48, టమాటా 26, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 26, క్యారెట్ 34, దొండకాయలు 26, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 44, బరబాటి 24, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 66, పొటల్స్ 40, కీరదోస 30, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడుచిక్కుడు 66, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	93
ఫారం ధర	--	113
విత్ స్కిన్	--	196
స్కిన్‌లెస్	--	206

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

శ్రీకృష్ణునికి భక్త నీరాజనం



గాజువాకలోని శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

పలు ప్రాంతాల్లో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

నగర్ సమీపంలోని శ్రీలక్ష్మీనరసింహనగర్‌లో ఉన్న గోపీజనవల్లభస్వామి ఆలయంలో సామవారికి ఉదయం గో క్షీరాభిషేకం, సహస్ర పుష్పార్చన, సామూహిక విష్ణుసహస్రనామం, భగవద్గీత పారాయణం చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు, కార్పొరేటర్లు బొమ్మిడి రమణ, రాపర్తి కన్నా, బల్ల శ్రీనివాసరావు, ముమ్మన దేముడు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కుమారుడు అప్పలనాయుడు, మాజీ ఎమెల్యే పిన్నింటి వరలక్ష్మితో పాటు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం ఊంజల సేవ, చిన్ని కృష్ణుల వేషధారణలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అలాగే గొల్ల నారాయణపురంలో శ్రీరాధాకృష్ణ ఫ్రెండ్స్, యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కాగా నాయుడుతోటలోని రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించనున్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 90వ వార్డు బుచ్చి



పురుషోత్తపురంలోని ఆలయంలో శ్రీకృష్ణునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

గాజువాక, ఆగస్టు 26: కృష్ణాష్టమి వేడుకలను సోమవారం పలు ప్రాంతాల్లో వైభవంగా నిర్వ హించారు. ఆలయాలన్నీ శ్రీకృష్ణుని నామంతో మార్మోగాయి. ఇందులో భాగంగా ఇక్కడి శ్రీకృష్ణ మందిరంలో ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీకృష్ణున్ని దర్శించుకున్నారు. భక్తుల తాకిడి అధికం కావడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

కూర్మన్నపాలెం: గ్రేటర్ 86వ వార్డు పరిధి రాసాలమ్మ కాలనీలో శ్రీగోకులకృష్ణా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని మండపం వద్ద కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ, గ్రామ కమిటీ పర్యవేక్షణలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తులసీ దళాలతో అర్చనలు చేశారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ కోటేశ్వరరావు, టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ, జనసేన పార్టీ ఇన్‌చార్జి కాదా శ్రీనులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఐదు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.

పెందుర్తి: ఇక్కడి పురుషోత్తపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహానికి చక్రస్నానం, పంచామృతాభిషేకాలు, అర్చనలు చేసి నక్షత్ర హారతులిచ్చారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఆలయానికి విచ్చేసి శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ కృష్ణాష్టమి వేడుకలు జరిపారు. ప్రశాంతినగర్‌లోని బృందావన్ విహార్ కాలనీలోని వేణుగోపాలస్వామి ఆలయంలో మహిళల కోలాటం, ఉట్టి కొట్టే ఉత్సవాన్ని సందడిగా చేపట్టారు. అలాగే చినముషిడివాడలోని శారదాపీఠంలో కృష్ణాష్టమి వేడుకులను పీఠం శ్రీకార్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. పీఠం ప్రాంగణంలోని శ్రీకృష్ణుని విగ్రహానికి అభిషేకాలు, పూజలు చేశారు. కాశూరి వెంకటసూర్యనారాయణ మూర్తి భగవద్గీత గానామృతం అలరించింది. సాయంత్రం కోలాటం, ఉట్టి కొట్టే ఉత్సవాన్ని చేపట్టారు. గోపికలు, బాలకృష్ణుని వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

వేపగుంట: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా భరత్



ములగాడలో శ్రీకృష్ణుని పూజల్లో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు, తదితరులు



గోపీజనవల్లభస్వామి ఆలయంలో మేయర్ హరి వెంకటకుమారి దంపతులు



శ్రీకృష్ణుని పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకుడు మూర్తి యాదవ్, తదితరులు

రాజుపాలెంలోని కృష్ణుని ఆలయంలో వంశీకృష్ణ యాదవ సేవా సంఘం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దుర్గాలమ్మ, బంగారమ్మ ఆలయం తరపున ప్రత్యేక వస్త్రం, స్వీట్లను అందజేశారు.

పెందుర్తి-రూరల్: మండలిలోని లక్ష్మీపురం గవరపాలెం కాలనీలో ఉన్న శ్రీకృష్ణుని ఆలయంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు ఆధ్వర్యంలో సుప్రభాత సేవలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

గోపాలపట్నం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గోపాలపట్నం, వెంకటాపురం, పాత గోపాలపట్నం, చంద్రనగర్‌లోని కృష్ణుడి ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లోని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరపగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. పాత గోపాలపట్నం, వెంకటాపురం ఆలయాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ఎన్ మూర్తి యాదవ్, వెంకటాపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వైసీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ కూడలిలో గోకుల యాదవ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కృష్ణాష్టమి వేడుకల్లో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజాది కార్యక్రమాల్లో ఏడు వార్డులకు చెందిన యాదవులు, కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేశ్, జనసేన నాయకుడు పుర్రె సురేశ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 60వ వార్డు పవన్‌పుత్ర నగర్‌లో చేపట్టిన వేడుకల్లో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కార్పొరేటర్ పీవీ సురేశ్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. పలు వీధుల్లో ఉట్టి కొట్టే ఉత్సవాల్లో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి మొల్లివానిసాలెం, అయ్యన్నపాలెం కాలనీల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. శ్రీమురళీకృష్ణ యాదవ సేవా సంఘం ప్రతినిధులు నమ్మి అప్పలరాజు, మొల్లి రమణ (అక్తర్), యు.అప్పారావు, తదితరులు ఉత్సవాలకు సారథ్యం వహించారు. గ్రేటర్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. అయ్యన్నపాలెంలో శ్రీకృష్ణ యాదవ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికు పూజలు చేశారు.

అక్కిరెడ్డిపాలెం: బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో హరిజన జగ్గయ్యపాలెంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో పాటు పలువురు యువతులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ప్రదర్శించిన నృత్య రూపకాలు అందరినీ అలరించాయి. అనంతరం చిన్నారులు కేరింతల నడుమ ఉట్టు కొట్టారు. కార్యక్రమంలో మింది హైస్కూల్ హెచ్‌ఎం పీవీఎస్ ఆంజనేయ, సోమేశ్వరి, శశి, శ్రీదేవి, మమత తదితరులు పాల్గొన్నారు. తుంగ్లాంలోని విజయరాఘవ స్వామి ఆలయంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులు శ్రీకృష్ణునికి పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. సాయంత్రం ఉట్టి కొట్టే ఉత్సవంలో అన్ని వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. అక్కిరెడ్డిపాలెంలోని శ్రీకృష్ణ మందిరంలో స్వామికి చేపట్టిన పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు గుడివాడ లతీశ్, బి.వెంకటరమణ, వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం'

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 26: ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ ప్లాంట్ అధ్యక్షుడు కేవీఎస్ఎన్ రావు అన్నారు. ప్లాంటులో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకపక్క ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ ప్లాంట్ ఆస్తుల అమ్మకాలకు కుట్ర చేస్తుండడం దారుణమన్నారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించేందుకు కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని ముందుకు సాగుతుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు డొక్కా నరసింగరావు, యేల్లేటి శ్రీనివాసరావు, నాయుడు, దేముడు, సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జిల్లా వ్యాప్తంగా సమావేశాలు

ఉక్కు పరిరక్షణ ఉద్యమానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తుందని, త్వరలో జిల్లా వ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తామని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ప్లాంటులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ కోసం శ్రమిస్తున్న కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. నాయకులు కారు రమణ, బీఎస్ రాజు, ఎస్ఏ నాయుడు, సాహూ, డి.మోహన్, గంగవరం గోపి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అక్కయ్యపాలెం, ఆగస్టు 26: గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కార్యాలయాన్ని సోమవారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఎంపీ ఎం.శ్రీభరత్, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, దక్షిణ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, నేతలు అకిరెడ్డి జగదీష్, కన్నం వెంకట రమణారావు, గురుగోవింద్ సింగ్, కుంతీదేవి, ముక్కి రామకృష్ణ, దువ్వి కాశీప్రసాద్, జేకే, ముప్పాళ్ళ శ్రీకృష్ణ, ఎంఎల్ఎన్ రావు, నాగమణి పాల్గొన్నారు.

30న ఐటీఐలో జాబ్‌మేళా

కంచరపాలెం, ఆగస్టు 26: కంచరపాలెం బాలికల ఐటీఐ నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 30వ తేదీ శుక్రవారం నిరుద్యోగ యువతకు జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు సబ్ రీజనల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. ఎస్ఆర్ అకడమిక్ ఆర్గనైజేషన్, శ్రీరామ్ చిట్స్ తదితర సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఎస్‌బీఐ కార్డ్స్ స్టోర్ ఎగ్జిక్యూటివ్ ,ఆడిట్ డిపార్టుమెంట్, టెలీకాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ తదితర ఉద్యోగాలను భర్తీ చేస్తారన్నారు. అభ్యర్థులు పదోతరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. తమ వివరాలను ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆసక్తి, అర్హత గల వారు 30వ తేదీ ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని శ్యాంసుందర్ కోరారు.

గ్రామ కమిటీకి అభినందనలు



కమిటీ సభ్యులను అభినందిస్తున్న కార్పొరేటర్ కవిత

కంచరపాలెం, ఆగస్టు 26: జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్-5 గ్రామ కమిటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఇందులో భాగంగా జైభారత్ యువజన సేవాసంఘం అధ్యక్షుడిగా రాజాన చిన్నబాబు, కార్యదర్శిగా కందికుప్ప త్రినాథ్, ట్రెజరర్‌గా చల్లా లక్ష్మీపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సోమవారం కార్పొరేటర్ గంకల కవిత అప్పారావును కలిసింది. వారిని కార్పొరేటర్ సత్కరించి అభినందించారు. గ్రామాభివృద్ధికి కృషిచేయాలని కోరారు.



మురళీనగర్‌లో వేడుకలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



వన్‌టౌన్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సీతమ్మధార, ఆగస్టు 26: స్థానిక శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని ప్రతిమ వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీకృష్ణ గానామృతంతో కూడిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం కృష్ణ కుచేల స్నేహానికి సంబంధించి నాటికను ప్రదర్శించారు. నర్సరీ నుంచి రెండోతరగతి విద్యార్థుల వరకు నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ ప్రదర్శనలో కృష్ణ, బలరామ, యశోద, కంశుడు, మీరాబాయి, కుచేలుడు, రాధ, రుక్మిణి, సత్యభామ వేషాలను ధరించి చిన్నారులు కనువిందు చేశారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్ శుభాకాంక్షలు తెలిపారు.

వన్‌టౌన్‌లో...

జగదాంబ కూడలి: వన్‌టౌన్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణతో అలరించారు. కృష్ణుడి విగ్రహం వద్ద ఎమ్మెల్యే, కూటమి శ్రేణులు పూజలు చేశారు. చిన్నారులకు సంస్థ ప్రతినిధి సూరి అప్పారావు సమకూర్చిన చిన్నికృష్ణుడి ఫొటోలను ఎమ్మెల్యే అందజేశారు. పాతనగరం లక్ష్మీటాకీస్ ఆంజనేయ స్వామి గుడి వద్ద కృష్ణాష్టమి సందర్భగా అన్న ప్రసాద వితరణ చేశారు.

సీతంపేట రాధాకృష్ణ మందిరంలో

సీతంపేట: సీతంపేట కూడలి రాధాకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి నిర్వహించారు. దేవతా మూర్తులను వెండి కిరీటాలు, పూలదండలు, తులసి మాలలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పూజలు చేశారు. ఇసరపు అప్పారావు, ఇసరపు వెంకటలక్ష్మి, ఇసరపు వాసు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో

విశాఖపట్నం: యదువంశీ రైల్వే ఎంప్లాయిస్ స్పిరిట్యుల్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్మాష్టమి వేడుకలు జరిగాయి. న్యూకాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపానికి స్వామి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పాల్గొన్నారు.

వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో

మురళీనగర్: స్థానిక వైశాఖీ స్పోర్ట్స్ పార్క్‌లో కృష్ణాష్టమి వేడుకలు పార్క్ కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, సెక్రటరీ సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరిగాయి. చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఉట్టి సంబరం జరిపారు. ఎంఎస్ఆర్ పార్కులో మాధవనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పోర్టు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు కృష్ణుడి విగ్రహానికి పూలమాల వేశారు. చిన్నారుల రాధా, కృష్ణుల వేషధారణతో అలరించారు.

జిల్లా పరిషత్ జంక్షన్‌లో...

మహారాణిపేట: జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న కృష్ణ చైతన్య మఠంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు. చిన్నారులను రాధా కృష్ణులుగా అలంకరించిన పలువురు తల్లిదండ్రులు వారిని ఆలయానికి తీసుకువచ్చి, అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



కృష్ణుడు, గోపికల వేషధారణలో శ్రీప్రకాష్ చిన్నారులు



న్యూకాలనీ వద్ద జరిగిన వేడుకల్లో డీఆర్ఎం

కేంద్రీయ విద్యాలయంలో...

అక్కయ్యపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు కృష్ణుడు, రాధ వేషధారణలు ధరించి అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కృష్ణాష్టమి విశిష్టతను ఉపాధ్యాయని ప్రగతి వివరించారు. ప్రిన్సిపాల్ కమల్‌జిత్, హెచ్ఎం ఎం.శైలజ, వై.విజయలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 27న ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 26: శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నవంబరు 27 నుంచి ఇంటర్నేషనల్ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. టోర్నీ పోస్టర్‌ను సోమవారం విశాఖ పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని జీవీఎంసీ ఎస్-3 స్పోర్ట్సు ఎరీనా వేదికగా ఆరు రోజుల పాటు జరిగే టోర్నీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆలిండియా చెస్ సమాఖ్య, ఏపీ చెస్ సంఘం, విశాఖ శాఖ సంఘం పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయని, వివిధ ప్రాంతాల రేటింగ్ క్రీడాకారులు పాల్గొనే ఈ టోర్నీలో విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రంగాల బాబూరావు వివరించారు. ఈ కార్యక్రమంలో చెస్ సంఘం ప్రతినిధులు ఏ.సురేష్, ఎస్.మణికంఠరావు, డాక్టర్ రామానుజస్వామి, ఎస్3 స్పోర్ట్సు ఎరీనా నిర్వాహకులు సుహాని సుమన్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్



క్రీడలతో మానసికోల్లాసం

▸▸ వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖపట్నం, ఆగస్టు 26: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. వీఎంఆర్డీఏ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్-2024లో భాగంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జిమ్నాజియం ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ఆయన మాట్లాడుతూ క్రీడలు ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. సంస్థ కార్యదర్శి దాట్ల కీర్తి, సంయుక్త కమిషనర్ వి.రవీంద్ర, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, డివిజనల్ ఫారెస్టు ఆఫీసర్ శాంతిస్వరూప్, ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు సేవలు అభినందనీయం

▸▸ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



వధూవరులకు కానుకలు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతంపేట, ఆగస్టు 26: పేదలకు తనవంతు సాయమందించాలని నిత్యం పరితపించే 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు సేవలు అభినందనీయమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రశంసించారు. జనసేన నగర పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన వధూవరులను ఎమ్మెల్యే ఆశీర్వదించి వారికి కార్పొరేటర్ సమకూర్చిన పట్టువస్త్రాలు, తాళిబొట్లు, పెళ్లికి అయ్యే ఖర్చు, రిజిస్ట్రేషన్ ఖర్చులను అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజును అభినందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మురళీనగర్ పోస్టాఫీసు తెరిపించాలి

మాధవధార, ఆగస్టు 26: గ్రేటరు 50వవార్డు మాధవధార హైస్కూలు పక్కన ఉన్న పోస్టాఫీసును ఇటీవల మూసివేశారు. దీనిని తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సోమవారం 50వవార్డు టీడీపీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, న్యాయవాది ఎస్.నరసింహ ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందించారు. అధిక శాతం రిటైర్డు ఉద్యోగులున్న మురళీనగర్, మాధవధార ప్రాంతంలో ఖాతాల నిర్వహణతో పాటు, తపాలా సేవలు, విద్యార్థులతో పాటు బాలికా సంరక్షణ పథకాలు, పొదుపు ఖాతాలు నిర్వహించేవారని, పోస్టాఫీసు మూసివేయడంతో సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఇక్కడ తిరిగి పోస్టాఫీసు ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ సహా టీడీపీ నేతలు కోరారు.



ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం ఇస్తున్న 50వ వార్డు టీడీపీ నేతలు

కలెక్టరేట్‌లో పరిశుభ్రతా చర్యలు



కలెక్టరేట్ ఆవరణలో తుప్పలను తొలగిస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పెరిగిన పొదలను సోమవారం తొలగించారు. కార్యాలయం వెనుకభాగం, భవనాల మధ్యన వర్షాకాలంలో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను ఎక్సకవేటర్‌తో తొలగించారు. చెత్త, గోడలపై పెరిగిన మొక్కలు తొలగించడంతో పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. పొదలు పెరగడంతో పాములు, పురుగులు వస్తాయని సిబ్బంది ఆందోళన వ్యక్తంచేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు కార్యాలయ ఆవరణ మొత్తం శుభ్రం చేయించారు.

మదర్ థెరిసా సేవలు నేటి తరానికి ఆదర్శం

▸▸ ఉత్తర ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, ఆగస్టు 26: మదర్ థెరిసా సేవలు ఆదర్శమని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు కొనియాడారు. థెరిసా 141వ జయంతి వేడుకలను సోమవారం గ్రేటర్ 47వవార్డులో నిర్వహించారు. కప్పరాడ-2 వద్ద ఏర్పాటు చేసిన థెరిసా విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ విదేశాల్లో జన్మించి భారత్‌కు వచ్చి మురికివాడల్లోని నిరుపేదలకు థెరిసా అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రాజారావు, శ్రీను, అరుణమ్మ, అరుణ్, ఫణి, కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో...

మహారాణిపేట: సేవా మూర్తి మదర్ థెరిసా జయంతిని జనసేన నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ జంక్షన్‌లో నేతలు మన్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలను, అనాథలను చేరదీసి మానవత్వానికి మరణం లేదని చాటిచెప్పిన మాతృమూర్తి మదర్ థెరిసా అని అన్నారు. ఆమె సేవాగుణాన్ని యువత అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



థెరిస్సా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

విశాఖ కోసం వంశధారలో రెండు ఇసుక రీచ్‌లు

విశాఖపట్నం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నగరవాసుల అవసరాల కోసం శ్రీకాకుళం జిల్లాలో రెండు ఇసుక రీచ్‌లను అధికారులు కేటాయించారు. వంశధార నది సమీపాన రెండుచోట్ల ఇసుక మేటలను గుర్తించిన శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం వాటిని విశాఖకు ఇవ్వాలని నిర్ణయించింది. రెండుచోట్ల సుమారు 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంటుందని అంచనా వేస్తున్నారు. వంశధార నదిలో పలుచోట్ల రీచ్‌లను శ్రీకాకుళం జిల్లా జల వనరుల శాఖ అధికారులు గుర్తించగా వాటిలో రెండింటిని విశాఖపట్నం జిల్లాకు ఇచ్చారు. నగరానికి నెలకు 30 నుంచి 35 వేల టన్నుల ఇసుక అవసరమని అంచనా వేస్తున్నారు. వంశధారలో ఇసుక తవ్వకాలకు కేంద్రం అనుమతి ఇచ్చిందని, గోదావరి నది నుంచి ఇసుక తరలింపునకు కూడా త్వరలో గ్రీన్‌సిగ్నల్ వస్తుందని అధికారులు చెబుతున్నారు. వంశధారలో ఇసుక మూడు, నాలుగు నెలలకు సరిపోతుందని, అప్పటికి గోదావరి నుంచి ఇసుక తరలింపునకు అనుమతి వస్తుందని అంటున్నారు. నగర పరిసరాలు, ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేకపోవడంతో వంశధార, గోదావరి నదులపై ఆధారపడాల్సి వస్తోంది.

కాగా అగనంపూడిలో ఇసుక అమ్మకాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు మూడు రోజుల నుంచి పినమడక గ్రామ సచివాలయంలో సొమ్ము చెల్లించి రశీదు తీసుకువెళితే డిపోలో డెలివరీ ఇస్తున్నారు. దీంతో రోజుకు 1,200 నుంచి 1,400 టన్నుల మాత్రమే వెళుతుంది. ప్రస్తుతం డిపోలో 40 వేల నుంచి 45 వేల టన్నుల ఇసుక ఉంది. అగనంపూడి డిపోలో ఇసుక మరో నెల రోజుల వరకూ సరిపోతుందని, ఈలోగా అమ్మకాలకు ఆన్‌లైన్ విధానం అమలులోకి వస్తోందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

'సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలి'

డాబాగార్డెన్స్, ఆగస్టు 26: సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలని ఏపీ బ్యాంకు విశ్రాంత ఉద్యోగ సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీవీవీ కొండలరావు, ఎ.ఎల్లారావు పిలుపునిచ్చారు. జిల్లా బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య సమావేశాన్ని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ సవరణ, బీమా ప్రీమియం తగ్గింపు, ఫామిలీ పెన్షన్ పెంపుదల, ఆరోగ్య బీమాపై జీఎస్టీ తగ్గింపు తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సమాజ సేవలో విశ్రాంత ఉద్యోగులు తమవంతు పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమానికి ఆర్.వి.రవికుమార్ స్వాగతం పలుకగా కె.కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. పి.వీరారెడ్డి, వి.జగన్‌మోహనరావు, జి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విశ్రాంత ఉద్యోగ సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎ.కోటేశ్వరరావు, అధ్యక్షుడిగా పి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.వి.రవికుమార్, ఉపాధ్యక్షులుగా ఐ.కేశవరావు, జి.రామచంద్రరావు, పి.రాఘవరావు, ఎం.ఎస్.భాస్కరరావు, సాగర్, ఎస్‌పీ మృత్యుంజరావు, 25 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

పాత వారికే పట్టం!

... 5వ పేజీ తరువాయి

అమరావతి పెద్దలు విశాఖ జిల్లా నాయకులను సంప్రతించడం లేదని, అందుకే ఇలాంటి నిర్ణయాలు వెలువడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కింది నుంచి పైవరకూ ఒక సామాజికవర్గం వారికే పదవులు ఇచ్చుకొన్నారు. ఇప్పుడు సామాజిక వర్గాలను పక్కన పెట్టినా ఆ బృందానికే పదవులు ఇవ్వడం ఏమిటనే చర్చ జరుగుతోంది.

బీఎస్ఎన్ఎల్ జోష్

... 5వ పేజీ తరువాయి

టవర్లను దేశవ్యాప్తంగా ఏర్పాటుచేస్తోంది. జిల్లాలో ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌కు ప్రీ, పోస్టు పెయిడ్ వినియోగదారులు 4.3 లక్షల మంది ఉన్నారు. వీరిలో 30 వేల మంది పోస్ట్ పెయిడ్ వినియోగదారులు కాగా, మిగిలిన నాలుగు లక్షల మంది ప్రీ పెయిడ్ వినియోగదారులు. రానున్న రెండు, మూడు నెలల్లో వినియోగదారుల సంఖ్య ఐదు లక్షలు దాటే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

బదిలీల సందడి

... 5వ పేజీ తరువాయి

విశాఖలోని వివిధ జోన్లలో పోస్టులకు సిఫారసులు చేస్తుండడం గమనార్హం.

వీఎంఆర్‌డీఏలో సెక్రటరీ పోస్టులో ఉన్న అధికారిణి ఆర్‌డీఓగా వేరే జిల్లాకు వెళతారని ప్రచారం జరుగుతోంది. ఆ స్థానంలోకి రావడానికి ప్రస్తుతం సింహాచలం దేవస్థానంలో ఈఓగా పనిచేస్తున్న శ్రీనివాసమూర్తి, అలాగే గతంలో వీఎంఆర్‌డీఏలోనే ఎస్టేట్ అధికారిగా పనిచేసి గోదావరి జిల్లాలో ఆర్‌డీఓగా ఉన్న వసంతరాయుడు ప్రయత్నిస్తున్నారు. విశాఖ జిల్లాలో పలు మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేసి డిప్యూటీ కలెక్టర్ హోదాలో ప్రస్తుతం అమరావతిలోని సీసీఎల్ఏలో పనిచేస్తున్న వేణుగోపాల్ కూడా సెక్రటరీగా రావాలని అనుకుంటున్నారు. ఆయన గతంలో కొద్ది నెలలే పనిచేసినా సంస్థను గాడిలో పెట్టేందుకు చేసిన ప్రయత్నాలు సఫలం కావడంతో అవకాశం ఉందని అంటున్నారు. జాయింట్ కమిషనర్‌గా రవీంద్ర వచ్చి మూడేళ్లు కావస్తుండడంతో ఆయన్ను మారుస్తారని ప్రచారం జరుగుతోంది. ఆ స్థానంలో గతంలో ఇక్కడే పనిచేసిన రమేశ్ వస్తారని అంటున్నారు.

గ్రీన్ బెల్ట్‌లో వైఎస్ విగ్రహం!



విగ్రహం ఏర్పాటుపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

... 5వ పేజీ తరువాయి

రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఏర్పాటుచేశారు. తెలుగుదేశం నాయకులు సోమవారం ఈ విషయం గుర్తించి జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేశారు. అనధికారికంగా విగ్రహం ఏర్పాటుపై సోమవారం రాత్రి నాలుగో పట్టణ పోలీసులకు విశాఖ ఉత్తర నియోజకవర్గ నాయకులు ఫిర్యాదు చేశారు. ప్రశాంతంగా ఉండే అక్కయ్యపాలెంలో వైసీపీ నాయకులు కావాలనే రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదుచేయాలని నిర్ణయించారు.

అవినీతి ఖాకీలపై నిఘా

... 5వ పేజీ తరువాయి

చేశారని చెబుతున్నారు. దీనిపై చర్చ జరుగుతుండగానే మల్కాపురం స్టేషన్‌లోని మహిళా ఎస్ఐ దేముడమ్మ ఒక కేసులో నిందితులను అరెస్టు చేయకుండా ఉండడానికి రూ.30 వేలు డిమాండ్ చేయడం, అడ్వాన్సుగా రూ.పది వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరకడం జరిగింది. దీంతో పోలీసుల అవినీతి మరోసారి ఆధారాలతో వెలుగులోకి వచ్చినట్టయింది. ఈ నేపథ్యంలో సీపీ శంఖబ్రత బాగ్చి శాఖలో అవినీతిపరులపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయడంతోపాటు సమాచారం సేకరిస్తున్నట్టు సమాచారం. ప్రత్యేకంగా ఒకరిద్దరు అధికారులకు ఈ బాధ్యత అప్పగించినట్టు ప్రచారం జరుగుతంది. వారిచ్చే నివేదికతోపాటు ఆధారాలు లభిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీపీ నిర్ణయించినట్టు పోలీస్ శాఖలోని ఒక అధికారి పేర్కొన్నారు.

ఆంగ్లంలోనే పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

విద్యార్థులకు మంగళవారం నుంచి వచ్చే నెల నాలుగో తేదీ నుంచి స్వీయ మదింపు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి ప్రతిరోజు ప్రశ్నపత్రాలు పంపిస్తారు. తొలిరోజు మంగళవారం సింహాచలంలో ఓరియంటల్ పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు, 28వ తేదీ నుంచి వచ్చే నెల నాలుగోతేదీ నుంచి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ప్రశ్నపత్రాలు లీకేజీకి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సంబంధిత యాజమాన్యాలు నిర్వహిస్తాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆనందపురం, ఆగస్టు 26: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్లలో మరమ్మతు పనులు చేపడుతున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఏఈ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రామవరం, జీఎస్.అగ్రహారం, యర్రవానిపాలెం, కణమాం, గండిగుండం, మామిడిలోవ తదితర పంచాయతీల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని వినియోగదారులు గ్రహించి సహకరించాలని ఆయన కోరారు.

మదర్ థెరెసా సేవలు అమోఘం



థెరెసా విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు

భీమునిపట్నం, ఆగస్టు 26: నిస్సహాయులకు, నిరుపేదలకు భారతరత్న మదర్ థెరెసా మానవతా దృక్పథంతో అందించిన సేవలు అమోఘమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. సోమవారం మదర్ థెరెసా 114వ జయంతిని పురస్కరించుకుని బీచ్ రోడ్‌లో వున్న విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషనరీస్ ఆఫ్ ఛారిటీ సంస్థను స్థాపించి భారత్‌తో బాటు 123 దేశాలలో 610 శాఖలను ఏర్పాటు చేసిన క్షయ, కుష్ఠు, నిస్సహాయులు, పేదలకు అందించిన సేవలను కొనియాడారు. మదర్ థెరెసా మానవతా దృక్పథంతో చేసిన సేవలు ఆదర్శనీయమని, అంతర్జాతీయ కీర్తిని పొందడమే గాక ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సాధించారని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవ్‌కుమార్, కొక్కిరి అప్పన్న, సంకురుభుక్త జోగారావు, వియ్యపు పోతురాజు, యానాపు శ్రీనివాసరావు, వాసుపల్లి వంశీ, వాసుపల్లి వీరుబాబు, అప్పికొండ నూకరాజు, పైడిపల్లి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, పట్టణ వైఎంసిఏ అధ్యక్షులు కెఎస్ఎం సుధాకర్, కె.ముత్యాలరావు, డి.ఈశ్వరరావు మదర్ థెరెసా విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

భూ బాధితుల రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్ విడుదల

తగరపువలస, ఆగస్టు 26: విజయవాడలో ఈ నెల 28న జరగనున్న భూ బాధితుల రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను తగరపువలస సీపీఐ కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలను నిరోధించాలని, నిరుపేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని ఈ సందర్భంగా సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై చర్చించడానికి సదస్సు జరుగుతున్నదని చెప్పారు. సదస్సుకు తగరపువలస పరిసర ప్రాంతాల నుంచి అత్యధికులు హాజరుకావాలని నాయకులు నాయకులు కానూరి రాంబాబు, మావూరి వీర్రాజు, మోర అప్పలరాజు, రాంపైడి పిలుపునిచ్చారు.

అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయాలి

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రామానాయుడు

పద్మనాభం, ఆగస్టు 26: పద్మనాభం మండలంలో బీజేపీ బలోపేతానికి అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని పార్టీ భీమిలి నియోజకవర్గ కన్వీనర్ కె.రామానాయుడు పిలుపునిచ్చారు. పద్మనాభంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రశిక్ష సమావేశంలో ఆయన ప్రసంగించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు సెప్టెంబరు 1వ తేదీ నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కనీసం ఎనిమిది వేల సభ్యత్వాలను చేర్పించేలా నాయకులు, గ్రామ కమిటీలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో నాయకులు ప్రకాశరావు, మహేష్ వెంకటరావు, తమ్మునాయుడు, సతీష్, మోహన్, అప్పన్న, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** సంగం, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), విశేష్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **తంగలాన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), తాతా (తగరపువలస)
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, శ్రీకన్య (గాజువాక)
- **ఆర్.కె.పురంలో :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 48, టమాటా 26, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజ్ 26, క్యారెట్ 34, దొండకాయలు 26, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 44, అల్లం (పాతది) 120, బరబాటి 24, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 66, పొటల్స్ 40, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 93
ఫారం ధర	-- 113
విత్ స్కిన్	-- 196
స్కిన్‌లెస్	-- 206

మరికొన్ని సిటీ వార్తలు పేజ్ 8 లో..





బాల గోపాలుని ఉయ్యాల సేవలో ఎమ్మెల్యే వెలగపూడి, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు... పెదగదిలిలో ఉట్టి కార్యక్రమం నిర్వహిస్తున్న యువకులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 26: భీమిలి, తూర్పు నియోజకవర్గాల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భీమిలి మండలం కృష్ణంరాజుపేటలోని రామాలయంలో జరిగిన కార్యక్రమంలో 50 మంది పిల్లలు రాధాకృష్ణ వేషధారణలో అలరించారు. అలాగే శ్రీకృష్ణుని వేషధారణలో ఉన్న పిల్లలు భగవద్గీతలో శ్లోకాలు వర్ణన వంటివి చేసి ఆకట్టుకున్నారు. అఅలాగే త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ఆధ్వర్యంలోదాకమర్రిలో వేడుకలు వైభవంగా జరిగాయి. నగరపాలెంలో దేవాలయంలో రుక్మిణి కల్యాణాన్ని నిర్వహించారు. అంతరంరం దేవతల హోమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, గ్రామ సర్పంచ్ జీవీ నారాయణ, జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, భీమిలి జడ్‌పిటిసి సభ్యుడు గాడు వెంకటప్పడు, మండల అధ్యక్షుడు సూర్యనారాయణరాజు, డెంకాడ మండలాధ్యక్షులు బంటుపల్లి వాసుదేవరావు పాల్గొన్నారు.



రాధాకృష్ణ వేషధారణలో చిన్నారులు

ఇస్కాన్‌లో అలరించిన కార్యక్రమాలు

సాగర్‌నగర్: ఇస్కాన్ రెండో రోజు ఉత్సవాలలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో సందడి చేశారు. విశాఖ వ్యాలీ స్కూల్ విద్యార్థులు రాధాకృష్ణ వేషధారణతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మవృత్తాంతాన్ని కళ్లకు కట్టినటుట కళారూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఇస్కాన్ దేవతామూర్తులను శాసన సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, గణబాబు, పోలీసు శాఖ ఉన్నతాధికారి కె.ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విశాఖ మొత్తం సాగరతీరానికి తరలి రావడంతో బీచ్ రోడ్డులో గంటలు తరబడి ట్రాఫిక్ స్తంభించింది.

ఆనందపురంలో...

ఆనందపురం: గంభీరం పంచాయతీ పరిధిలోని ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేశారు. అనంతరం అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణ, ప్రభ దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులతో 108 సార్లు హరినామ జపం చేయించి బాల గోపాలునికి ఉయ్యాల సేవ నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

ఎండాడలో...

ఎండాడ: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని గొల్లల ఎండాడ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం గొల్లల ఎండాడ పురవీధుల్లో ఉత్సవ మూర్తి ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఉట్టు కొట్టుట, ఆట పోటీలను చేపట్టారు. విజేతలకు వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నొడగల అప్పారావు, లొడగల రామ్మోహన్, పోలిరాజు, చిన్నా, ఆర్టీవో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాడి రాజు ప్యాలెస్‌లో...

పెదవాల్తేరు: గాడిరాజు ప్యాలెస్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, నాయకులు కొయ్యప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, కార్పొరేటర్ ఉషశ్రీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆటల పోటీలు, ఉట్టి మహోత్సవం నిర్వహించారు. కృష్ణ ఎవరు అనే అంశంపై పది ప్రశ్నలకు పరీక్ష ఏర్పాటు చేశారు. అలాగే సత్యసాయి విహార్‌లో చిన్నారులు శ్రీకృష్ణుని పుట్టుక నుంచి వివిధ జీవిత సన్నివేశాలను ప్రతిబింబించేలా చూపించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చేకూరి వరలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెదగదిలిలలో...

ఆరిలోవ: పెదదిలి బాలమురళీ సంఘం ఆధ్వర్యంలో వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు ఐదు రోజుల పాటు ఉత్సవాలను జరుపుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఐదో రోజు అనుప ఉత్సవం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, విశాఖ పార్లమెంటరీ నాయకులు ఒమ్మి పోలారావు, బుడుమూరు గోవింద్, 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, కార్యదర్శి గాడి సత్యం తదితదరులు పాల్గొన్నారు. ఆదర్శనగర్ గోపిక వేషధారణలో చిన్నారులు ఎంతగానో ఆకట్టుకున్నారు. అలాగే పెదగదిలిలో ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు.

మురళీకృష్ణ సంఘం ఆధ్వర్యంలో...

సింహాచలం: మహా విశాఖ 98వ వార్డు పరిధిలోని మురళీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకగా నిర్వహించారు. సంఘం నిర్వహించిన పూజల్లో వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొని ప్రజల క్షేమాన్ని కాంక్షిస్తూ పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీవార్డు అధ్యక్షులు పంచదార్ల శ్రీనివాస్, నాయకులు లండ శ్రీనివాస్, బర్ల బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాదిలో...

కొమ్మాది: నగరంలోని ఐదో వార్డులో పలు ప్రాంతాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బొట్టవానిపాలెం, రాజీవ్‌గృహకల్ప, గణేష్‌నగర్, ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకలకు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈగల రవి, లంక రాజేంద్రప్రసాద్, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.





భీమిలిలోని రామాలయంలో రాధాకృష్ణ వేషధారణలో పిల్లలు... ఆనందపురంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కార్మికుల సమస్యల పరిష్కారానికి 'చలో ఢిల్లీ'

అఖిలపక్షాలకార్మిక సంఘ నాయకుల సమావేశంలో తీర్మానం

తగరపువలస, ఆగస్టు 26: చిట్టివలస జూట్ మిల్లులో ఇతరుల పేరుతో పనిచేసి మిల్లు మూతపడిన తర్వాత ఎటువంటి పరిహారాన్ని నోచుకోని మారుపేరు కార్మికుల సమస్యల పరిష్కారానికి వచ్చే నెల మొదటి వారంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టాలని అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం తీర్మానించింది. చిట్టివలస కాంగ్రెస్ కార్మిక సంఘం కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు జేవీ కైలాస్‌రెడ్డి అధ్యక్షత సోమవారం జరిగిన ఈ సమావేశం నిర్వహించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు, జాయింట్ లేబర్ కమిషనర్‌కు అనేకసార్లు విన్నవించినా ఫలితం రాలేదని, అందువల్ల కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు నాయకులు తెలిపారు. మారుపేర్లతో పనిచేసిన కార్మికులు పీఎఫ్, పించన్లు రావడం లేదన్నారు. అందువల్ల కేంద్ర స్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులను కలుసుకుని సమస్యను విన్నవించాలని అన్ని సంఘాల నాయకులు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కార్మిక సంఘానికి చెందిన దల్లి అప్పలరెడ్డి, ఎం.ఆదినారాయణ, గుండేల అప్పారావు, ఏఐటీయూసీ సంఘానికి చెందిన కె.ఈశ్వరరావు, సిహెచ్.రాంపైడి, కె.రాంబాబు, టీఎన్‌టీయూసీకి చెందిన నరవ రామారావు, సాడి అచ్చారావు, మద్దుల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



చిట్టివలసలో కార్మిక సంఘాల నాయకుల సమావేశం

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం, ఆగస్టు 26: వరాహలక్ష్మీ నృసింహ స్వామికి వైభవంగా ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహ వచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేసి మంగళవాయిద్యాల నడుమ జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణలు కావించి అక్షితారోపణ జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



కల్యాణం చేస్తున్న అర్చకులు

పెద్దిపాలెంలో కోడి వ్యర్థాలతో ఆందోళన

ఆనందపురం, ఆగస్టు 26: మండలంలోని పెద్దిపాలెం పంచాయతీలో ఉన్న కోళ్లఫారం యజమానులు వ్యర్థాలను ఎక్కడికక్కడ పడేస్తుండడంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ పరిధిలో సుమారు లక్ష కోళ్లు పెంచే సామర్థ్యంతో కోళ్లఫారాలను నడుపుతున్నారు. అయితే చనిపోయిన కోళ్లు, మిగిలిన వ్యర్థాలను జన సంచారం మధ్యలో లేదా నీరు నిల్వ ఉండే చెరువులు, కాలువలు వద్ద పడేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యర్థాలు కుళ్లిపోయి విపరీతమైన దుర్వాసన వెదజల్లడంతో ఆ మార్గంలో ప్రయాణించాలంటేనే భయాందోళన చెందుతున్నారు. ఈ వ్యర్థాల ద్వారా దోమలు వృద్ధిచెంది అనేక రకాల జ్వరాలకు కారణాలుగా మారుతున్నాయి. ఈ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోళ్లఫారం యజమానులపై చర్యలు తీసుకోవాలని, తమ వ్యర్థాలను జనసంచారం లేని చోటకు తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పెద్దిపాలెంలో చెరువుల పక్కనే పడేసిన కోడి వ్యర్థాలు



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భగవద్గీత సారం అనుసరణీయం

» భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఆగస్టు 26: శ్రీకృష్ణుని భగవద్గీత సారం అందరికీ అనుసరణీయమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆధ్యాత్మిక జీవన సంఘం ఎంవీపీ టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కృష్ణ తత్వంపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సునాయాసంగా ఎదుర్కొనే సామర్థ్యం అలవడుతుందన్నారు. ధ్యానం వల్ల మానసిక రుగ్మతులు తగ్గుముఖం పట్టి శారీరక ఆరోగ్యం పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ భరత్‌ను కలిసిన బీజేపీ నేతలు



ఎంపీ భరత్‌ను కలిసిన రవీంద్ర తదితరులు

పెదవాల్తేరు, ఆగస్టు 26: విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర సోమవారం మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ నగరంలో వినాయక ఉత్సవాలు ముగిసిన తరువాత విగ్రహాలను నేరుగా సముద్రంలో నిమజ్జనం చేయకుండా, బీచ్‌లో కొన్ని చోట్ల మాత్రమే నిమజ్జనం చేయడం కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఆయా ప్రదేశాల్లోనే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేలా కృషి చేయాలని కోరారు. అలాగే గెడ్డలు ద్వారా డ్రైనేజీ విడుదల చేసే విధంగా చర్యలు చేపట్టాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వరరావు, బీజేపీ విశాఖ పార్లమెంట్ సంయోజక్ ఎస్ఏ రామ్మోహన్, బీజేపీ విశాఖ తూర్పు నియోజకవర్గం కన్వీనర్ ఎస్ఆర్ఎల్ఎన్ మురళి మోహన్‌రాజు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన అవసరం

» మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా మోర్చా అధ్యక్షురాలు సుజాత

తగరపువలస, ఆగస్టు 26: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలపై గ్రామీణులకు అవగాహన అవసరమని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత పేర్కొన్నారు. తగరపువలసలో సోమవారం జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అయితే కేంద్ర పథకాలపై తగిన ప్రచారం లేదని, ప్రజలకు వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. వాడవాడలా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పినగాడి విజయ, మండల శాఖ అధ్యక్షురాలు సీరపు రామలక్ష్మి, నాయకులు గుజ్జు రాము, నర్సుబాయి, వెంకటరెడ్డి త్రినాథరెడ్డి, సాధూరావు, ధరణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొంతలకోటి జన్మదిన వేడుకలు



బొంతలకోటికి కేక్ తినిపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

భీమునిపట్నం, ఆగస్టు 26: రిటైర్డ్ ఉద్యోగి బొంతలకోటి కృష్ణమూర్తి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. భీమిలి బీచ్ రోడ్డులోని నోవాటెల్ రిసార్టులో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల మధ్య కృష్ణమూర్తి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన కుమారులు మధుసూదనరావు, రామకృష్ణ, వెంకటరమణ, కుమార్తె విజయలక్ష్మి, కోడలు పద్మజ కేక్ తినిపించారు. అలాగే అందరూ పుష్పగుచ్ఛాలు అందించి, దుశ్శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. అందరికీ ఆయన ఆశీస్సులు అందించారు. ఈ వేడుకలలో రిటైర్డ్ డాక్టర్ సోములు, పిరిడి సత్యనారాయణ, బీకేవీఎన్ బాలాజీ, రేలంగి వెంకటస్వామి, గుడ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన ఈల పాటల కచేరి



కచేరిలో ఈల పాటలు పాడుతున్న శివప్రసాద్ బృందం

మద్దిలపాలెం, ఆగస్టు 26: ఈల పాటలు మార్మోగాయి. రెండు గంటల పాటు ఏకధాటిగా ఈల గానాలు ఝుమరిపించాయి. రెండు, మూడు నిమిషాలు ఊపిరి బిగపట్టి పాడటమే కష్టమనుకుంటే, రెండు గంటల పాటు ఏకధాటిగా ఈలల ద్వారా పాటలు పాడి ఆశ్చర్యపరిచారు ఈల పాటల కళాకారుడు కె.శివప్రసాద్. పీఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో సోమవారం ఈలలగానామృతంలో కళాభిమానులు మునిగితేలారు. వాతాపిగణపత్తింభజేహం, దొరకునా ఇటువంటి సేవా, స్వాగతం కృష్ణా, మరకత మణిమయ చేలా పాటలు ఈలలతో ఆలపించగా ఆడిటోరియం చప్పట్లతో మార్మోగిపోయింది. వయోలిన్‌పై సత్యనారాయణశర్మ, మృదంగంపై రామకృష్ణ, తబలాపై గుణరంజన్, కీ బోర్డుపై లాల్‌కృష్ణ సహాయ సంగీతం అందించారు. ఈ కార్యక్రమంలో విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ నిర్వాహకులు మంతెన సత్యనారాయణ, గుమ్మలూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.